ఇన్‌శాట్-3డీఎస్ కౌంట్‌డౌన్ ప్రారంభం

నేడు సాయంత్రం 5.35 గంటలకు ప్రయోగం

చెన్నై, ఫిబ్రవరి 16: ఇన్‌శాట్-3డీ వాతావరణ ఉపగ్రహానికి కౌంట్‌డౌన్ మొదలైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 వ్యోమనౌక ద్వారా దీన్ని నింగిలోకి పంపనున్నట్టు ఇస్రో వెల్లడించింది. మూడో తరం వాతావరణ ఉపగ్రహమైన ఇన్‌శాట్- 3డీఎస్‌ను భూ స్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర భూ విజ్ఞాన శాఖ ఈ ఉపగ్రహ ప్రయోగానికి నిధులు సమకూర్చింది.

భూ వాతావరణంలోకి కార్టోశాట్-2

విజయవంతంగా తిరిగి తీసుకొచ్చిన ఇస్రో

17 ఏండ్లపాటు సేవలందించిన ఉపగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 16: అధిక రెజల్యూషన్ గల ఫొటోలు తీసే ఇస్రో రెండో తరంలోని మొదటి ఉపగ్రహమైన కార్టోశాట్-2ను శుక్రవారం విజయవంతంగా భూ వాతావరణంలోకి తీసుకొచ్చినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఈ ఉపగ్రహం 17 ఏండ్ల పాటు సేవలందించింది. 'సాయంత్రం 3.48కి హిందూ మహా సముద్రం మీదకు ఈ ఉపగ్రహాన్ని తీసుకొచ్చాం. దీన్ని దహనం చేస్తాం లేదా సముద్రంలో పడిపోయేలా వదిలేస్తాం' అని ఇస్రో అధికారి ఒకరు తెలిపారు. కార్టోశాట్ గమనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు ఇస్రో తెలిపింది. ఈ శాటిలైట్ భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించినప్పుడు దాని అన్ని ప్రధాన భాగాలు విచ్ఛిన్నమైపోతాయని వెల్లడించింది. 2007లో ప్రయోగించిన ఈ శాటిలైట్ 2019 వరకు పట్టణ ప్రణాళిక కోసం హై రెజల్యూషన్ కలిగిన ఫొటోలు తీసి పంపింది. అంతర్జాతీయ అంతరిక్ష మార్గదర్శకాల ప్రకారం దీన్ని ధ్వంసం చేయాలనుకుంటున్నట్టు ఇస్రో చెప్పింది. సహజంగా కార్టోశాట్-2 తన కక్ష్య నుంచి విడిపోవడానికి 30 ఏండ్లు పడుతుందని భావించారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

రాష్ట్రపతి ముర్ముకు ఎన్‌సీఎస్‌సీ నివేదిక

సందేశ్‌ఖాలీని సందర్శించిన కమిషన్

బెంగాల్ అల్లర్లపై సుప్రీంలో పిల్ దాఖలు

సందేశ్‌ఖాలీ బాధితురాలిని పరామర్శిస్తున్న గవర్నర్ సీవీ ఆనంద బోస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరమున్నదని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్(ఎన్‌సీఎస్‌సీ) రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నివేదించింది. సందేశ్‌ఖాలీలో టీఎంసీ మద్దతుదారులు మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఎన్‌సీఎస్‌సీ నివేదికను రూపొందించి రాష్ట్రపతికి సమర్పించిందని కమిషన్ చీఫ్ అరుణ్ హల్దార్ శుక్రవారం తెలిపారు. టీఎంసీ నాయకుడు షాజహాన్ షేక్, అతని మద్దతుదారులు బలవంతంగా స్థానికుల భూములు లాక్కోవటమేగాక తమను లైంగికంగా వేధించారని పెద్ద సంఖ్యలో మహిళలు ఫిర్యాదు చేయటంతో ఎన్‌సీఎస్‌సీ ప్రతినిధి బృందం గురువారం సందేశ్‌ఖాలీని సందర్శించింది. రాష్ట్రపతికి నివేదికను సమర్పించిన తర్వాత కమిషన్ చీఫ్ అరుణ్ విలేకరులతో మాట్లాడుతూ సందేశ్‌ఖాలీలో స్థానికులపై జరిగిన దౌర్జన్యాలు, వారి అనుభవించిన హింసను వివరించారు. ఎస్సీల హక్కులను కాపాడేందుకు ఉద్దేశించిన ఆర్టికల్ 338 ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితిపై రాష్ట్రపతి పాలన విధించాలని తాము సిఫారసు చేసినట్టు అరుణ్ తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం షెడ్యూల్డ్ రాజ్యాంగ భద్రతల పనితీరుపై ప్రతి ఏటా, ఇతర సమయాల్లో రాష్ట్రపతికి ఎన్‌సీఎస్‌సీ నివేదికలు సమర్పించాల్సిన బాధ్యత ఉన్నది. కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చినట్టు అరుణ్ తెలిపారు. సందేశ్‌ఖాలీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని పేర్కొంటూ తమను ఆ ప్రాంతాన్ని సందర్శించకుండా అడ్డుకున్నారని కమిషన్ ఆరోపించింది. అంతేగాక తమ పర్యటనకు ఎలాంటి ఏర్పాట్లు కూడా అక్కడి ప్రభుత్వం చేయలేదన్నారు. రాష్ట్రంలో నేరగాళ్లు ప్రభుత్వంతో చేతులు కలిపారని అరుణ్ ఆరోపించారు. సందేశ్‌ఖాలీలో అల్లర్లకు, హింసకు, దౌర్జన్యానికి పాల్పడిన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌పై రేషన్ కుంభకోణానికి సంబంధించి ఈడీ గత నెలలో అతని ఇంటిపై దాడి చేసనప్పటి నుంచి అతను పరారీలో ఉన్నాడని, వెంటనే అతడిని అరెస్ట్ చేయాలని చాలా మంది మహిళా బాధితులు డిమాండ్ చేస్తున్నారు. దేశంలోనే అత్యధికంగా ఎస్సీ జనాభా కలిగిన రాష్ట్రాల్లో బెంగాల్ రెండో స్థానంలో ఉన్నదని, హింసాకాండ వల్ల వారంతా ఇబ్బందులు పడుతున్నారని అరుణ్ చెప్పారు. అక్కడి హింసాకాండపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ నోటీసు కూడా పంపిన సంగతిని ఆయన గుర్తు చేశారు. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం కాపాడటం లేదని, టీఎంసీ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రతినిధి బృందాలు కూడా సందేశ్‌ఖాలీని సందర్శించాల్సి ఉన్నది, కానీ అక్కడ శుక్రవారం కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉన్నది.

సుప్రీం కోర్టు దృష్టికి సందేశ్‌ఖాలీ అంశం

సందేశ్‌ఖాలీలో మహిళలను లైంగికంగా వేధించిన అంశం ఇప్పుడు సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. దీనిపై విచారణను పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. సందేశ్‌ఖాలీ దౌర్జన్యాలపై గురువారం ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలైంది. ఈ అంశంపై సీబీఐ లేదా సిట్‌తో కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని పిల్‌లో కోరారు. అలాగే విచారణను అత్యవసరంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సందేశ్‌ఖాలీ బాధితులకు పరిహారంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. అలాగే ఈ కేసు దర్యాప్తు, విచారణను పశ్చిమ బెంగాల్ నుంచి తప్పించాలన్నారు.

మరో పాతికేళ్లలో అమెజాన్ అడవులు సగం ఖాళీ!

న్యూఢిల్లీ: దక్షిణ అమెరికాలోని 8 దేశాల్లో విస్తరించిన అమెజాన్ అడవులు అంతరించిపోతున్నాయి! విస్తీర్ణంలో భారత్ కంటే దాదాపు రెట్టింపుగల ఈ అడవులు 2050 నాటికి సుమారు 47 శాతం తగ్గిపోబోతున్నాయని బ్రెజిల్‌లోని ఫెడరల్ యూనివర్సిటీ ఆఫ్ శాంటా కాటరినా విడుదల చేసిన నివేదిక తెలిపింది. దీనికి కారణం వాతావరణంలో ఉష్ణోగ్రతల పెరుగుదల, కార్చిచ్చులు, అడవుల నరికివేత, ఆక్రమణలు అని వివరించింది. ప్రపంచ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణకు కీలకంగా ఉపయోగపడుతున్న అమెజాన్ అడవుల్లో ఇప్పటికే 15 శాతం నాశనమైనట్లు తెలిపింది. ఈ పరిస్థితి మరింత తీవ్రమైతే, ఈ అటవీ ప్రాంతం ఉష్ణమండల పచ్చిక బయలుగా మారిపోవచ్చునని అంచనా వేసింది.

ప్రముఖ చెఫ్ ఇంతియాజ్ ఖురేషీ ఇకలేరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చెఫ్ ఇంతియాజ్ ఖురేషీ (93) శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. ఐటీసీ హోటల్స్‌లో ఖురేషీ మాస్టర్ చెఫ్. 1931లో లక్నోలోని చెఫ్‌ల కుటుంబంలో జన్మించిన ఖురేషీ దమ్ పుఖ్ వంటకాన్ని పునరుద్ధరించినందుకు ప్రశంసలు అందుకున్నారు. 2015లో ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడిన సందర్భంలో బిర్యానీ అంటూ ఏదీ లేదని.. అన్నీ పులావ్‌లు మాత్రమేనని సంచలన కామెంట్స్ చేశారు ఖురేషీ. ఆయనే చెప్పుకున్నట్టు జీవితాంతం అత్యాశ లేకుండా నిజాయితీగా పనిచేశారు ఖురేషీ. ఆయన మృతి వార్త తెలుసుకున్న పలువురు సోషల్ మీడియా వేదికగా సంతాపాన్ని తెలిపారు.

2 లక్షల నిరుద్యోగుల్లో 32 మందికి ఉద్యోగం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగా): గుజరాత్‌లో మొత్తం 2.38 లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి కోసం రిజిస్టర్ చేసుకుంటే, గత రెండేళ్లలో కేవలం 32 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించింది. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, గుజరాత్‌కు చెందిన 29 జిల్లాల్లో గత రెండేళ్లలో 2,38,978 మంది ఉన్నత విద్య చదువుకున్న నిరుద్యోగులు ఉద్యోగాల కోసం తమ పేరును రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. గుజరాత్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత రెండేళ్లలో కేవలం 32 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు రాగా, అందులో 22 మంది అహ్మదాబాద్ వాసులు, మరో 9 మంది భావ్‌నగర్ వాసులు కాగా, ఒకరు గాంధీనగర్ వాసి. ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అత్యధికంగా ఆనందనగర్ నుంచి 21,633 మంది నిరుద్యోగులు ఉన్నారు.

నైకీలో 1600 మంది ఉద్యోగులకు ఉద్వాసన

వాషింగ్టన్: ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ తయారీ సంస్థ నైకీ 1600 మందికిపైగా ఉద్యోగులను తొలగించనున్నది. ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీలో పనిచేస్తున్న వారిలో 2 శాతం మందిని తొలగిస్తున్నట్టు శుక్రవారం ఆ సంస్థ వెల్లడించింది. సంస్థలో ప్రస్తుతం 83,700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వ్యయ నియంత్రణలో భాగంగానే ఉద్యోగులను తొలగిస్తున్నట్టు కంపెనీ తెలిపింది. భవిష్యత్తు విక్రయాల అంచనాలు నిరాశాజనకంగా ఉన్న నేపథ్యంలో, వృద్ధి అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని పేర్కొన్నది.

వంగా భవిష్యవాణి నిజమవుతున్నదా?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ఆధునిక నోస్ట్రాడమస్‌గా పిలువబడే బల్గేరియన్ ఆధ్యాత్మికవేత్త బాబా వంగా 2024కు సంబంధించి గతంలో చెప్పిన భవిష్యవాణి నిజమౌతున్నదని సోషల్‌మీడియాలో నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. వంగా అంచనా వేసినట్టే క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను త్వరలో అభివృద్ధి చేయనున్నట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన ప్రకటనను ఇందుకు ఉదహరిస్తున్నారు. అలాగే, బ్రిటన్‌లో ఆర్థిక సంక్షోభం కొనసాగుతుండటం, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ర్యాంకుల్లో జపాన్ నాలుగో స్థానానికి పరిమితమవ్వడం వంటి అంశాలను కూడా ఉటంకిస్తున్నారు. ఇవన్నీ, గతంలోనే వంగా భవిష్యవాణిలో ఊహించినట్టు పేర్కొంటున్నారు. అయితే, 2024లో జరుగబోయే మరి కొన్ని విపత్తులు, విషాదాల గురించి కూడా వంగా తన భవిష్యవాణిలో ముందుగానే అంచనా వేశారు. ఇప్పుడు అవి కూడా నిజమౌతాయా? అనే చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. కాగా వంగా గతంలో అంచనా వేసిన విధంగానే ట్విన్ టవర్ ఎటాక్స్, ప్రిన్సెస్ డయానా మృతి, చర్నోబిల్ ఉదంతం, బ్రెగ్జిట్ వ్యవహారం నిజంగానే జరుగడం తెలిసిందే.

2024కు సంబంధించి వంగా అంచనా వేసిన మరికొన్ని అంశాలు

- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరుగుతుంది.
- ఐరోపా దేశాలపై ఉగ్రవాదులు భీకరంగా దాడులకు తెగబడుతారు.
- ప్రపంచ యవనికపై తన ప్రాధాన్యాన్ని పెంచుకొంటున్న ఓ దేశం.. జీవాయుధాలను పరీక్షించడమే కాదు, దానితో దాడులకు తెగబడుతుంది.
- గతంలో ఎన్నడూచూడని స్థాయిలో వాతావరణంలో మార్పులు కనిపిస్తాయి.
- పవర్ గ్రిడ్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్, దేశాల భద్రతే లక్ష్యంగా సైబర్ దాడులు జరుగుతాయి.
- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో విప్లవాత్మకమైన ఆవిష్కరణలు వెలుగుచూస్తాయి.

పోలీసుల తీరు మారాలి

- **విధులపై వారికి అవగాహన కల్పించాలి**
- **పౌరసేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి**
- **కరీంనగర్ టూటౌన్ పోలీసులపై కేసులో డీజీపీకి హైకోర్టు సూచన**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పోలీసుల ప్రవర్తన తీరు మారాల్సిన అవసరం ఉన్నదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజల కోసం పోలీసులు ఉన్నారని, పోలీసుల కోసం ప్రజలు లేరని వ్యాఖ్యానించింది. విధుల నిర్వహణతోపాటు ప్రజలతో ఎలా వ్యవహరించాలన్న దానిపై పోలీసులకు సర్క్యులర్ జారీ చేయడంతోపాటు వారికి అవగాహనా తరగతులు నిర్వహించాలని, పౌరసేవల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని డీజీపీకి సూచించింది. తన పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఓ జడ్జి కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేయలేదంటూ ఓ మహిళ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ విచారణకు కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో ఓదెల వెంకటేశ్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. సదరు మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 14న ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఈ విషయంలో జాప్యం జరిగినందుకు బేషరతుగా క్షమాపణ చెప్తున్నామని తెలిపారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ.. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టడాన్ని, ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసులు జాప్యం చేయడాన్ని వదిలిపెట్టబోమని తేల్చి చెప్పింది. ప్రజలు ఊరికే పోలీస్ స్టేషన్‌కు రారని, సమస్య ఉంటేనే వస్తారని పేర్కొంటూ.. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉన్నదని గుర్తు చేసింది. ఈ విషయంపై సమాధానం చెప్పాల్సిందేనని, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యానికి కారణాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. ఈ విచారణ అనంతరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినందున పిటిషన్‌పై తదుపరి విచారణ అవసరం లేదని ప్రకటించింది.

సత్తువ లేదాయే.. సీటు లేకపాయే!

టికెట్ కొన్న వృద్ధులకూ కష్టాలు 'ఉచితం' • సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయంతో సామాన్యులు బస్సుల్లో పడుతున్న బాధలు ఇన్నన్ని కావు. పురుషులకు సీట్లు దొరకడం లేదు. వృద్ధుల సీట్లూ ఖాళీగా ఉండడం లేదు. ఒంట్లో సత్తువ లేని ఓ వృద్ధుడు తప్పని పరిస్థితుల్లో బస్సెక్కి పడ్డ అవస్థల్ని కండ్లకు కట్టే ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాళ్లూచేతులు వణుకుతున్న వృద్ధుడిని పట్టుకొని ఉన్న యువకులు సీటు కోసం అందరినీ ప్రాధేయ పడుతున్న దృశ్యాలు సామాన్యుల కష్టాలను కండ్లకు కడుతున్నాయి. టికెట్‌కు డబ్బులు చెల్లించి కష్టాలు 'కొని'తెచ్చుకోవడం ఏంటో అంటూ వీడియో చూసిన వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ కొన్న వృద్ధులకు కూడా కష్టాలు 'ఉచితమే' అంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు మరికొందరు. ఇటీవల దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ప్రకటించిన టీఎస్ఆర్టీసీ వృద్ధులకు కేటాయించిన సీట్లలో వారే కూర్చునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

25 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

- **గతంలో జారీ చేసిన జీవోలో పలు మార్పులు**
- **తాజాగా జీవో 88ను విడుదల చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 25 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. వీరిలో కొంత మందికి పోస్టింగులు కూడా ఇచ్చారు. గతంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ జీవో జారీ చేశారు. అయితే కొన్ని సవరణలతో డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ శుక్రవారం మరో జీవో (జీవో 88)ను విడుదల చేశారు. బదిలీ అయిన వారిలో 11 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, 14 మంది డిప్యూటీ కలెక్టర్లు ఉన్నారు. ఈ జీవో వెంటనే అమల్లోకి వస్తుందని జీవోలో పేర్కొన్నారు.

రామకృష్ణారెడ్డి మృతికి సీపీఐ సంతాపం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): పీవోడబ్ల్యూ జాతీయ కార్యదర్శి సంధ్య భర్త రామకృష్ణారెడ్డి మరణం పట్ల సీపీఐ ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. రామకృష్ణారెడ్డి మరణం ప్రజా ఉద్యమాలతో మమేకమైన ఆ కుటుంబానికి తీరనిలోటని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ, సీనియర్ నాయకులు ప్రేమ పావని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీపీఐలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆరెకంటి సుబ్బారెడ్డి, సుబ్బమ్మ సంతానమైన రామకృష్ణారెడ్డి హైదరాబాద్‌లో ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకొని జీవనం కొనసాగించారని తెలిపారు. పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్యను ఆయన ఆదర్శ వివాహం చేసుకున్నారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని పశ్యపద్మ, ఇతర సీపీఐ నేతలు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

సౌర విద్యుత్తుకు రాష్ట్రమూ చేయూతనివ్వాలి

- **సోలార్ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్‌ను పునరుద్ధరించాలి**
- **తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ విజ్ఞప్తి**

హైదరాబాద్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): పేద, మధ్యతరగతి ప్రజలు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలకుతోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా అదనపు సబ్సిడీలు అందించాలని తెలంగాణ రాష్ట్ర సోలార్ ఎనర్జీ అసోసియేషన్ విజ్ఞప్తిచేసింది. దీనివల్ల లబ్దిదారులపై ఆర్థికభారం తగ్గి, సోలార్ విద్యుత్తు వినియోగాన్ని పెంచే అవకాశం ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు రాష్ట్రాలు సబ్సిడీలు అందిస్తున్నాయని, తెలంగాణలో కూడా గతంలో అదనపు సబ్సిడీని మంజూరు చేశారని ఆయన గుర్తుచేశారు. గతంలో మాదిరిగా టెండర్లను ఆహ్వానించి, పవర్ పర్చేస్ అగ్రిమెంట్ ద్వారా సోలార్ విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తిచేశారు. పరిశ్రమలు, పెద్ద సంస్థలు తమ సొంత అవసరాలకు అవసరమైన విద్యుత్తును సోలార్ ప్లాంట్ల ద్వారా ఐదు మెగావాట్ల వరకు(క్యాప్టివ్ పవర్) స్వయంగా ఉత్పత్తి చేసుకొని వాడుకోవడానికి అనుమతులను మంజూరు చేయాలని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచించారు.

శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు కొట్టివేత

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌పై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. ఈ మేరకు నాంపల్లిలోని 1వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి రమాకాంత్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఎన్నికల అఫిడవిట్‌ను ట్యాంపర్ చేశారంటూ శ్రీనివాస్‌గౌడ్‌పై నమోదైన కేసులో పిటిషనర్ రాఘవేంద్ర రాజు దాఖలు చేసిన ప్రొటెస్టు పిటిషన్‌పై సుదీర్ఘ వాదనల అనంతరం జడ్జి స్పందిస్తూ.. ఈ కేసు విచారణను కొనసాగించే అధికారం ప్రత్యేక కోర్టుకు లేదని స్పష్టం చేశారు. ప్రైవేటు పిటిషన్‌పై కేసు నమోదు చేసే అర్హత కింది స్థాయి మేజిస్ట్రేట్ కోర్టుకు ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తదుపరి కోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించారు.

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ

(కార్మిక & ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)

రికవరీ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి, ప్రశాంతినగర్, TSRTC బస్ కాంప్లెక్స్, 1వ & 2వ అంతస్తు, 'Y' జంక్షన్ దగ్గర, కూకట్‌పల్లి, హైదరాబాద్-500018

ల్యాండ్ లైన్: 040-29703775, ఫ్యాక్స్: 040-29707720,

ఇ-మెయిల్: ro.kukatpally@epfindia.gov.in వాట్సాప్ హెల్ప్ లైన్ నం. 9392369549

బహిరంగ వేలం/అమ్మకం

షెడ్యూల్‌లో తెలిపిన r/o. M/s. 24 బై 7 కార్పొరేట్ సర్వీసెస్, **G-I, ఇంపీరియల్ రెసిడెన్సీ, 6-1-339/4, పద్మారావు నగర్, సికింద్రాబాద్, హైదరాబాద్** (డిఫాల్టింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్)లో స్థిరాస్తి అమ్మకం EPF & MP యాక్ట్ 1952లోని సెక్షన్ 8(B)(1)(a) క్రింద అటాచ్ చేయబడినది మరియు అది MSTC లిమిటెడ్ (వెబ్‌సైట్: https//www.mstcecommerce.com) ద్వారా 20 ఫిబ్రవరి, 2024న ఉదయం 11.00 గంటలకు బహిరంగ వేలం ద్వారా రికవరీ ఆఫీసర్, ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి, హైదరాబాద్ ద్వారా **ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ప్రాతిపదికన** షెడ్యూల్ చేయబడినది.

ఆస్తి షెడ్యూల్

ఆస్తి నం.	బహిరంగ వేలంలో విక్రయించబడే ఆస్తి వివరణ	పరిమాణం	రిజర్వు ధర
1.	3 BHK ఫ్లాట్, నార్త్ ఈస్ట్ ఫేస్ ఎంట్రన్స్ **యజమాని:**శ్రీ సతీష్ సింగ్, తండ్రి ప్రతాప్ సింగ్, G-I, ఇంపీరియర్ రెసిడెన్సీ, పద్మారావునగర్, సికింద్రాబాద్	గ్రౌండ్ ఫ్లోర్‌లో 1305.00చ.అడుగుల ప్లింత్ ఏరియా, సూపర్ బిల్టప్ ఏరియా 1450.00 చదరపు అడుగులు	రూ. 52.95 (లక్షలు)

నియమ నిబంధనలు:

1. పైన తెలిపిన ఆస్తి షెడ్యూల్‌లో పేర్కొన్న ఒక్కొక్క ఆస్తికి ఎదురుగా తెలిపిన రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడదు.
2. డెటార్/డిఫాల్టర్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌కు బకాయి మొత్తం చెల్లించినట్లయితే వేలం/అమ్మకం రద్దు చేయబడుతుంది. వేలం వాయిదా వేయుట లేదా రద్దుచేయు వేలం నిర్వహించు అధికారి విచక్షణ మేరకు ఉంటుంది.
3. వేలం/అమ్మకంలో పాల్గొనుటకు ఆసక్తి గల వ్యక్తులు బయానా అనగా అంచనా విలువ అనగా రూ. 2.64 లక్షలలో 5% డిపాజిట్ చేయాలి. గెలుపొందిన బిడ్డరు విషయంలో డిపాజిట్ చేసిన మొత్తం బిడ్ మొత్తం నిమిత్తం సర్దుబాటు చేయబడుతుంది.
4. గెలుపొందిన బిడ్డరు పేరున ఒకసారి బిడ్ కొట్టివేయబడిన తరువాత, అతను/ఆమె అదే రోజులోగా బిడ్ మొత్తంలో 25% డిపాజిట్ చేయాలి మరియు మిగిలిన మొత్తాన్ని అమ్మకం తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనియెడల బయానా నిమిత్తం గెలుపొందిన బిడ్డరు చెల్లించిన మొత్తం జప్తు చేయబడుతుంది మరియు ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఆస్తి తిరిగి వేలం వేయబడుతుంది.
5. ప్రతీసారి బిడ్డింగ్ రూ. 50,000/- పెంచబడుతుంది. బిడ్ మొత్తం పరంగా లేదా బిడ్డరు పరంగా ఏదేని వివాదం ఎదురైన సందర్భంలో, లాట్ మళ్ళీ ఒకసారి వేలానికి ఉంచబడుతుంది.
6. పైన తెలిపిన ఆస్తిపై ఏదేని చెల్లించవల్సిన కన్వేయన్స్ నిమిత్తం ఛార్జీలు మరియు పన్నులు/సుంకాలు గెలుపొందిన బిడ్డరు భరించాలి.
7. అన్ని వివాదాల క్రింద రికవరీ ఆఫీసర్ నిర్ణయం తుదిగా ఉంటుంది.
8. పాల్గొనువారు **19-02-2024న మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల** మధ్య ఆస్తి తనిఖీ చేసుకోవచ్చును మరియు సవివరమైన నియమ నిబంధనలు పొందవచ్చును. దీనికి సంబంధించి వారు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారిని సంప్రదించవచ్చును. సంప్రదించండి: కె. సుధీర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్: 7013364300.

ప్రదేశం: రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి
తేది: 15-02-2024

సం/- రికవరీ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి